అంగన్‌వాడీ అవస్థల ఒడి



షాద్‌నగర్ రూరల్: ఎలుకలు, పందికొక్కులు తవ్వడంతో ధ్వంసమైన బండలు

- అంగన్‌వాడీలకు పాములు, ఎలుకల బెడద
- శిథిలావస్థలో భవనాలు
- ఆహారం ఎలుకల పాలు
- సొంత భవనాలు, టాయిలెట్లు కరువు

కొత్తూరు: చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించి వారికి విద్యాబుద్ధులు నేర్పేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోంది. చిన్నారుల ఎదుగుదలకు పాలు, గుడ్లు, బాలామృతం వంటి పోషక ఆహారాన్ని కూడా అందిస్తున్నారు. ప్రభుత్వ ఆశయం బాగానే ఉంది. కానీ అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల నడుమ కొనసాగుతున్నాయి. సౌకర్యవంతంగాలేని గదులు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటి నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. పాడుబడ్డ భవనాలు పాములు, ఎలుకలకు నివాసాలుగా మారాయి. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు భయంతో వణికిపోతున్నారు.

స్వంత భవనాలు కరువు

మండలంలో 31 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 1082 మంది చిన్నారులు, 255 మంది



కొత్తూరు: ఆరుబయట చదువుకుంటున్న చిన్నారులు

గర్భిణీలు, 225 మంది బాలింతలున్నారు. కానీ 664 మంది చిన్నారులు మాత్రమే హాజరవుతున్నారు. కాగా 31 కేంద్రాల్లో 16 కేంద్రాలకు స్వంత భవనాలున్నాయి. మిగిలిన భవనాలను యువజన సంఘాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని మిగులు గదుల్లో కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ 15 కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు లేక చిన్నారులు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

అపరిశుభ్రంగా పౌష్టికాహారం

మండలంలోని ఆయా కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన బాలామృతం ప్యాకెట్లను నిల్వచేశారు. రోజుల తరబడి అలాగే ఉండడంతో ఏలుకలు తింటున్నాయి. అంతేకాకుండా గుడ్లు, బాలామృతం ప్యాకెట్లు నిల్వ చేసిన ప్రదేశంలో ఏలుకల వ్యర్థాలతో అపరిశుభ్రంగా మారాయి.

అద్దె కష్టాలు..!

మొయినాబాద్: అద్దె కష్టాల జాబితాలో అంగనవాడీ కేంద్రాలు చేరాయి. చిన్నారులు, బాలింతల కోసం ఏర్పాటు చేసిన అంగనవాడీ కేంద్రాలు ఎక్కువగా అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. మొయినాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం 'సాక్షి' విజిట్ చేసింది. మొయినాబాద్ మండల కేంద్రంలో ఓ అంగన్‌వాడీ కేంద్రం, మరో మినీ అంగన్‌వాడీ కేంద్రన్నాయి. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో 25 మంది పిల్లలున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు ఉదయం గుడ్డు, మధ్యాహ్నం భోజనం పెడుతున్నారు. మూడేళ్లలోపు పిల్లలకు పిల్లలకు గుడ్లు, బాలామృతం పౌష్టికాహారాన్ని ఇళ్లకు ఇస్తున్నారు.

శిథిలావస్థలో భవనం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భవనం కురుస్తోంది. భవనం ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. దీంతో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులకు కేంద్రాలకు పంపడానికి ఇష్టపడడం లేదు. వరండాలనే విద్యార్థులకు చదువు చెబుతున్నారు.

ఆహారం ఎలుకల పాలు

చిన్నారులకు అందించే పౌష్టికాహారంలో సగభాగం ఎలుకల పాలవుతోంది. అలాగే ఎలుకలు, పందికొక్కులు మట్టిని తవ్వుతుండటంతో చిన్నారులు కింద కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

చేవెళ్ల మండలంలో..

చేవెళ్ల: చేవెళ్ల మండల కేంద్రంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 1, 2 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 3వ, 4వ కేంద్రాలకు సొంతభవనాలు లేకపోవటంతో ఒకే గదిలో రెండు కేంద్రాలను కొనసాగిస్తున్నారు. రంగారెడ్డి నగర్ కాలనీకి చెందిన 3వ కేంద్రం, హౌసింగ్‌బోర్డులో 4వ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకే వంటగదిని వాడుకుంటున్నారు. ఈ రెండు కేంద్రాల్లో మొత్తం 62 మంది పిల్లలు ఉన్నారు. చేవెళ్లలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పిల్లల సంఖ్య బాగానే ఉంది. ఈ కేంద్రాల్లో పౌష్టికాహారం కూడా సక్రమంగానే అందిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



అంగన్‌వాడీ భవనం శిథిలావస్థలో ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తాను. భవనానికి మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరాను. మరమ్మతుల కోసం ఎంత ఖర్చు అవుతుందో వ్యయ ప్రణాళికను తయారుచేసి పనులను చేపడతామని అధికారులు తెలిపారు.

– నాగమణి, సీడీపీఓ, షాద్‌నగర్

స్వంత భవనాలు ఇక్కట్లు

మండలంలో 31 కేంద్రాలకు గాను 15 కేంద్రాలకు స్వంత భవనాలు లేవు. ఇక్కడ చిన్నారులతో పాటు సిబ్బంది, గర్భిణీలు, బాలింతల కోసం ఏలాంటి సౌకర్యాలు లేవు. ఈ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– జ్యోతి, ఐసీడీఎస్, సూపర్‌వైజర్, కొత్తూరు

ఆధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాలు

షాబాద్: షాబాద్ మండలంలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 69 ఉన్నాయి. ఇందులో 2441 మంది విద్యార్థులు ఈ కేంద్రాలకు వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. గర్భిణీలు, బాలింతలు 310 మంది ఉన్నారు. షాబాద్ మండలంలోని మల్లారెడ్డిగూడ, అంగన్‌వాడీ కేంద్రంలో 12 మంది విద్యార్థులు ఉన్నట్లు హాజరుపట్టీలో రాశారు. కానీ ఒక్క విద్యార్థి మాత్రమే కేంద్రానికి వస్తున్నాడు. పోతుగల్ అంగన్‌వాడీ కేంద్రంలో 16 మంది విద్యార్థులకు గాను 5 మంది మాత్రమే కేంద్రంలో ఉన్నారు.

శంకర్‌పల్లి మున్సిపాలిటీలో

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ సెంటర్‌ల వ్యవస్థ అస్తవ్యస్తంగా సాగుతోంది. ఇక్కడ గర్భిణీలకు చిన్నారులకు పౌష్టికాహారం అందడంలేదనే విమర్శలున్నాయి. అయ్యప్పరెడ్డిగూడ కాలనీలో కేంద్రంలో నిర్వహణ సరిగా లేదు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ఎంపీపీ నక్షత్రంజేవంతు

మొయినాబాద్ రూరల్: ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆనందంగా ఉంటామని ఎంపీపీ నక్షత్రంజేవంతు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సుకన్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, సర్పంచ్ సుకన్య, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మోర శ్రీనివాస్, చిన్న మంగళారం ఎంపీటీసీ మల్లేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు

మొయినాబాద్ రూరల్: మండలంలోని కాశింబౌలి గ్రామంలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. నీరు నిలిచి రోడ్డుపై గోతులు ఏర్పడుతున్నాయి. వాహనాదారులు మురికి నీటిలోనే ప్రయాణం చేస్తున్నారు. మురుగు నుంచి వచ్చే దుర్వాసనను భరించలేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై మురుగు ప్రవహిస్తుంటే గ్రామ పంచాయతీ పాలకవర్గం, మండల అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆరోగ్య భరోసా

కొత్తూరు: సీఎంఆర్‌ఎఫ్‌తో ప్రభుత్వం పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఆయన కొత్తూరు పట్టణానికి చెందిన మనోహర్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ. 60 వేల విలువ చేసే చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు, ఇతర ప్రమాదాల్లో గాయపడి అత్యవసరంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందే పేదలకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా ఆర్థికంగా ఆదుకుంటుందని వివరించారు.

క్లుప్తంగా

కార్మిక చట్టాలను కేంద్రం నిర్వీర్యం చేస్తోంది

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తూరు: కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు దుయ్యబట్టారు. ఈ నెల 9,10వ తేదీల్లో శంషాబాద్ పట్టణంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాపడావ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను పర్వతాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవరణల పేరుతో కార్మిక చట్టాలను కోడ్‌లుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షకీల్, జంగయ్య, హుస్సేన్, అశోక్, ఎల్లయ్య, కిషన్, జంగయ్య, లక్ష్మయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



అప్పోజీగూడలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మొయినాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అప్పోజీగూడ సర్పంచ్ రాజు కోరారు. బుధవారం అప్పోజీగూడలోని కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలకు మెరుగైన వైద్య సేవలు అవసరమన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, వార్డు సభ్యులు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చరగమగీతం పాడాలని యువజన కాంగ్రెస్ తాలుక వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖదీర్ పిలుపునిచ్చారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ కేసీఆర్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెం దింపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సబ్బండ వర్గాలకు సమన్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్, రవినాయక్, గోపాల్, నరేశ్, శంకర్, బలరాం, శ్రీకాంత్, ఖాదర్, రాజేందర్‌రెడ్డి, శేఖర్, రమేశ్, సౌమ్య, రాజు, గిరి, సంతోష్, అంజద్, మల్లేష్, సంతోష్, పాష తదితరులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



నులిపురుగుల నివారణ మాత్రలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అమ్రిత జోసెఫ్

కొందుర్గు: నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వం ప్రతి ఏటా జనవరి, జూలై మాసాలలో ఆల్‌బెండజోల్ ట్యాబ్‌లెట్లు పంపిణీ చేస్తోంది. అయితే ఈ ఏడాది జూలై 20వ తేదీన మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా.. వర్షాల వలన పాఠశాలలకు సెలవులిచ్చారు. దీంతో గురువారం అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నులిపురుగులు పరాన్న జీవులు. ఈ పురుగులు చిన్నారుల శరీరంలోకి చేరితే ప్రమాదమే. నివారణ కోసం ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తోందని డాక్టర్ అమ్రిత జోసెఫ్ తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నులిపురుగుల నివారణ కోసం ఆల్‌బెండజోల్ ట్యాబెలెట్ వేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. పూర్తిగా ఉడికిన ఆహారాన్ని తినాలి. చిన్నారులు మట్టిలో ఆడుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మల, మూత్ర విసర్జనకు విధిగా బాత్‌రూమ్‌లు వాడాలి. వాటిని ఎప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి.

బీఆర్‌ఎస్‌ది మాటల పాలన

కొత్తూరు: ప్రజా సమస్యలను పట్టించుకోకుండా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాటలతోనే పాలన కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వర్షాలకు రైతులు, ప్రజలు నష్టపోయారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక రూపొందించకపోవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్, ఖలీల్, గణేశ్, శ్రీకాంత్, గోపాల్, దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కర పత్రాలు పంపిణీ చేస్తున్న హరినాథ్‌రెడ్డి

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న అవినాశ్‌రెడ్డి

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: షాబాద్ మండలాన్ని జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ, పోతుగల్, సంకెపల్లిగూడ గ్రామాల్లో పల్లెపల్లెకు అవినాశ్‌రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ పాలనలో సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో మారుమూల పల్లెలన్నీ ప్రగతి పథకంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రజలందరూ బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలని, తెలంగాణలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్ రావు, మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు సతీష్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు దర్శన్, చందిప్ప జంగయ్య, మల్లేశ్ తదితరులున్నారు.

అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం

ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాల్సి ఉందని చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి అభిప్రాయపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను గ్రామాల్లో అత్యవసరమైన పనులకు ముందుగా కేటాయించి వాటిని పూర్తి చేయాలన్నారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పార్టీలకు అతీతంగా పనిచేయాలని సూచించారు. సర్వసభ్య సమావేశంలో సభ్యులు సూచించిన సమస్యలను మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

తూతూ మంత్రంగా సర్వ సభ్య సమావేశం

మండలంలోని పలుశాఖల అధికారులు వారివారి అంశాలను చదివి వినిపించి వెళ్లారు. కానీ ప్రశ్నించేవారు లేకపోవటంతో సర్వ సభ్య సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని వర్షకాలం కావటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు శ్రీనివాస్, వెంకటేశంగుప్తా, జహంగీర్, జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీలు నరేందర్‌చారి, రవీందర్ రెడ్డిలు తెలిపారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయని వీటిని వెంటనే బాగు చేయాలని అడిగారు. ప్రజలు గ్రామాల్లో సమస్యలపై నిలదీస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సత్యనారాయణచారి, కిష్టయ్య, రవీందర్‌రెడ్డి, యాదమ్మ, రాంచంద్రయ్య, శైలజ, శ్రీనివాస్, బాబర్, వివిధ శాఖ అధికారులు ఎంపీడీఓ హిమబిందు, సీడీపీఓ శోభారాణి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

అంతారంలో మైనింగ్‌కు అనుమతులు ఇవ్వద్దు

చేవెళ్ల: మండలంలోని అంతారం గ్రామ రెవిన్యూలో మైనింగ్ తవ్వకాలతో గ్రామాలకు తీరని అన్యాయం జరుగుతోందని, ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వీరేందర్‌రెడ్డి, నాయకులు అంజయ్యగౌడ్, వీరస్వాములు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలో మైనింగ్ తవ్వకాలకు అనుమతులివ్వద్దని ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. గతంలో మైనింగ్ అనుమతులు ఇచ్చి గ్రామానికి తీరని అన్యాయం చేశారని గ్రామ సర్పంచ్ సులోచన ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్ రూరల్: సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తెలిపారు. టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన సందర్భంగా బుధవారం ఆర్టీసీ కార్మికులు సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై.. సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ సీఎం తీసుకున్న నిర్ణయం హర్షనీయమన్నారు. ప్రజలందరి అండదండలతో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కావలికార్లకు అన్యాయం చేయొద్దు

ఆర్డీఓ, తహసీల్దార్‌కు వినతి

చేవెళ్ల: రికార్డుల్లో ఉన్న పేర్ల ప్రకారమే ప్రభుత్వం వీఆర్ఏల క్రమబద్ధీకరణ చేస్తే.. వాటాబంధు కింద పనిచేస్తున్న కావలికార్లకు తీరని అన్యాయం జరుగుతుందని, ఈ విషయాన్ని పునఃపరిశీలన చేయాలని గుండాల గ్రామానికి చెందిన కావలికార్ల కుటుంబాల సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం చేవెళ్లలో ఆర్డీఓ సాయిరాం, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్‌తో పాటు కలెక్టరేట్‌లో వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గుండాలలో ఏళ్ల తరబడి కావలి వెంకయ్య వారుసులుగా వెంకటయ్య, సత్తయ్య, బాలయ్య, వెంకటయ్యల కుటుంబాలు, మరో వర్గానికి చెందిన కావలి రాములమ్మ, కావలి సత్యమ్మ కుటుంబసభ్యులు ఏడాది ఒక్కరు చొప్పున వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

'హరిత' లక్ష్యాన్ని చేరుకోవాలి

చేవెళ్ల క్లస్టర్ ఏపీడీ చరణ్‌గౌతం

షాద్‌నగర్ రూరల్: ప్రతిఒక్కరూ హరితహారంలో భాగస్వాములై ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలని చేవెళ్ల క్లస్టర్ ఏపీడీ చరణ్‌గౌతం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో హరితహారంపై పంచాయితీ కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చరణ్‌గౌతం మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. హరిత హారంలో నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణతో పాటుగా వ్యవసాయ పొలాలలో మొక్కలను నాటి హరిత లక్ష్యానికి తమవంతు తోడ్పాటును అందించాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపుల నాటడంతో పాటుగా వెంచర్‌లలోని 10శాతం స్థలాలలో మొక్కలను నాటాలని సూచించారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు పంచాయితీ కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీఓ అరుణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రామచంద్రయ్య, ఎంపీఓ గిరిరాజు, పంచాయితీ క్యాదర్శులు జైపాల్‌రెడ్డి, తేజస్విని, స్వప్న, శంకర్, ప్రమోద్, శ్రీలత, సరిత, పాండురంగారెడ్డి, యాదయ్య, అనిల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చరణ్‌గౌతం

సీఐకి సన్మానం

షాద్‌నగర్ రూరల్: పట్టణ సీఐగా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్‌లింగంను బీజేపీ ఎస్సీమోర్చా నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో సీఐని శాలువాతో సన్మానించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ నరేశ్, మండల అధ్యక్షుడు నర్సింహ్మ పాల్గొన్నారు.



సీఐ ప్రతాప్‌లింగంను సన్మానిస్తున్న నాయకులు

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆంజనేయులు

ఇప్పలపల్లి సర్పంచ్ అంజనేయులు

కేశంపేట: తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యకరమని ఇప్పలపల్లి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. ఇప్పలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలను తాగించాలని సూచించారు. బిడ్డకు పాలివ్వడం వలన ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశంపేట సెక్టార్ సూపర్‌వైజర్ దివ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో...

మండలంలోని కొత్తపేట సెక్టార్ పరిధిలో ఉన్న సంగెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 1, 2లలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుమల్య, శశికళ, గ్రామ మహిళలు రమాదేవి, సుల్తానా, అనూష, రిష్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

మొయినాబాద్ రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల జీవితాలు దీనస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, గుర్తింపు కార్డుల కోసం కార్మికులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, కార్మికులు ప్రేమిళ, కృష్ణ, సుధాకర్, భారతమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీని ముట్టడిస్తాం

షాబాద్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హెచ్చరించారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మె బుధవారానికి 29వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు వేధింపులకు గురి చేస్తున్నారని మండి పడ్డారు. అసెంబ్లీ సమావేశాలలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను చర్చించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులున్నారు.



వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్

సమ్మె విరమించం

షాద్‌నగర్ రూరల్: గ్రామపంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేదిలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు ప్రకటించారు. తమ డిమాండ్లను జీపీ కార్మికులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. అనంతరం రాజు మాట్లాడుతూ కార్మికుల శ్రమతోనే గ్రామాలకు స్వచ్ఛత అవార్డులు వస్తున్నాయని పేర్కొన్నారు. 28 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని విమర్శించారు. ఇప్పటికైనా గ్రామ పంచాయితీ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు జంగయ్య, సరిత, నర్సింలు, మల్లేష్, వెంకటయ్య, పుష్పమ్మ, యాదమ్మ, మంగమ్మ, రుక్కమ్మ, ముత్యాలు, తారమ్మ తదితరులు పాల్గొన్నారు.